వరలక్ష్మీ వ్రత పూజలో పాల్గొన్న మల్లారెడ్డి, రవీందర్ యాదవ్




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 251 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 05 సెప్టెంబర్ 2026


## కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

# పర్యటన

● పలు అభివృద్ధి పనులు పరిశీలించిన సీఎం రేవంత్ ● హకీంపేట్ ఎడ్యుకేషన్ పనులపై ముఖ్యమంత్రి ఆరా

**హైదరాబాద్,సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** కొడంగల్‌ను అభివృద్ధి బాట పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ దిశగా ముందుకెళు_న్నారు. అధికారులతో నిరంతర పర్యవేక్షణతోపాటు సీఎం సైతం వరుస పర్యటనలతో పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. మొదట నారాయణపేట జిల్లా మద్దూరు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాలను పరిశీలించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అక్కడి నుంచి సాం?ఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పరిశీలించిన ముఖ్యమంత్రి నిర్మాణం పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మద్దూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం తన సొంత డబ్బులతో భూమిని సీఎం కొనుగోలు చేశారు. మిగతా2లో...



## విద్యార్థులను తీర్చిదిద్దడంలో

# టీచర్లదే కీలకపాత్ర

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం చేస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆమె శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల మార్గనిర్దేశం, మెంటార్‌షిప్ ద్వారా విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, వారి వ్యక్తిత్వ వికాసానికి బలమైన మిగతా2లో...

## 6న ఎర్రవల్లిలో బీఆర్ఎస్ పార్టీ శాసన సభా పక్ష భేటీ

- పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సమావేశం




## కేసీఆర్ చాలా మంచోడు.. హుందాగా

# రిసీవ్ చేసుకునేవారు

- కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్,సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌కు గురైన కొండా సురేఖ వరుస ఇంటర్వ్యూలతో కాంగ్రెస్ సర్కార్‌పై, పార్టీ అంతర్గత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆమె ప్రశంసల వర్షం కురిపించడం... ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కేసీఆర్ వ్యవహారశైలి ఎలా ఉండేదన్న ప్రశ్నకు సురేఖ స్పందిస్తూ... "కేసీఆర్ గారు చాలా మంచి వ్యక్తి. తమను ఎప్పుడు కలిసినా ఎంతో గౌరవంగా, హుందాగా రిసీవ్ చేసుకునేవారు" అని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీలో మిగతా2లో...

## హద్దులు దాటితే ఎవరిపైనైనా

# చర్యలు తప్పవు

- సురేఖ తొలగింపుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్






## కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం

- లక్సెంబర్గ్ వెంచర్ డేస్-2026లో కీలకోపన్యాసానికి పిలుపు

**హైదరాబాద్,సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ వేదిక నుంచి ఆహ్వానం అందింది. యూరప్‌లో స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటల్, పెట్టుబడుల రంగాలకు సంబంధించిన ప్రముఖ మిగతా2లో...

## జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం

# విజయవంతం


జియోసింక్రోనస్ కక్ష్యలోకి దేశ మొట్టమొదటి ఇమేజింగ్ శాటిలైట్



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ-ఇస్రో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి ఇస్రో ప్రయోగించిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. దేశంలోనే తొలిసారి జియో-ఆర్బిట్ కోసం ఉద్దేశించిన అత్యాధునిక ఎర్త్ అబ్జర్వేషన్ ఉపగ్రహం జూరా-05ను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో రియల్ టైమ్ ఇమేజరీ అందించడంలో ఈ ఉపగ్రహం ఎంతో కీలకం కానుంది. రెండో లాంచ్ ప్యాడ్ నుంచి వేకువ జామున 2గంటల 55నిమిషాలకు జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ అత్యాధునిక భూ పరిశీలన ఉపగ్రహం జూరా-05ను నింగిలోకి మోసుకెళ్లింది. సబ్-జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. సుమారు 8నెలల విరామం తర్వాత ఇస్రో ఈ మిషన్‌ను చేపట్టింది. జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది 19వ రాకెట్ ప్రయోగం. 2,268 కిలోల మిగతా2లో...

# ఢిల్లీలో కుండపోత వర్షం

● జలమయమైన విమానాశ్రయం ● విమాన సేవలకు తీవ్ర అంతరాయం




## కొండా సురేఖను

# తొలగించారు..

- పొంగులేటి సంగతి ఏమిటి?:

- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు



# జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

బరువు ఉన్న -05 ఉపగ్రహం సరిహద్దు ప్రాంతాలను వేగంగా, స్పష్టంగా కెమెరాలతో పరిశీలించనుంది. తుపానులు వరదలు, భూకంపాలను నిమిషాల వ్యవధిలోనే గుర్తించనుంది. ప్రకృతి విపత్తులపై ముందస్తు హెచ్చరికలను జారీ చేయనుంది. పంటల ఆరోగ్యం, భూ వినియోగంలో మార్పులను పరిశీలించనుంది. దేశ రక్షణరంగంలో ఈ ఉపగ్రహం కీలకం కానుంది. సరిహద్దుల సమాచారాన్ని రియల్ టైమ్‌లో సేకరించనుంది. వరుసగా ఎదురైన వైఫల్యాల తర్వాత ఇస్రో సాధించిన ఈ విజయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటివరకు చేపట్టిన 18 ప్రయోగాల్లో ఈ రాకెట్ 6సార్లు పూర్తిస్థాయి విజయాన్ని నమోదుచేయలేకపోయింది. 2021లో మిషన్ ప్రయోగం 307సెకన్ల తర్వాత క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో విఫలమైంది. దానికి ప్రత్యామ్నాయంగా ఈ మిషన్‌ను విజయవంతంగా చేపట్టారు. అంతకుముందు ఈ ఏడాది జనవరి 12న 16ఉపగ్రహాలతో ప్రయోగించిన రాకెట్ కీలకమైన మూడోదశలో తలెత్తిన లోపం కారణంగా నిర్దేశిత కక్ష్యలోకి చేరలేకపోయింది. 2025 మే నెలలో చేసిన ౹ూూం-జ 61 ప్రయోగం కూడా మోటార్ కేస్‌లో ప్రెజర్ సమస్యల వల్ల సక్సెస్ కాలేదు. ఈ నేపథ్యంలో ఇస్రో సుదీర్ఘ విరామం తర్వాత జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం చేసింది. మరోవైపు ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా తొలి మానవరహిత మిషన్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఇస్రో ఛైర్మన్ ఎ.నారాయణన్ వెల్లడించారు. దీనికోసం వివిధ పరిశ్రమలు, ఇతర సంస్థలతో కలిసి ఇస్రో బృందం అత్యంత ప్రణాళికాబద్ధంగా, ముమ్మరంగా పనిచేస్తోందని తెలిపారు. ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టాక ఇస్రో ఛైర్మన్ శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఈఓఎస్-05 ప్రయోగం ద్వారా ఇస్రో తొలి విజయాన్ని నమోదు చేసిందని పేర్కొన్న ఆయన, కష్టానికి దక్కే ప్రతిఫలం మరింత కష్టపడటమేనని ఉద్ఘాటించారు. దేశ బహుళ అవసరాల నిమిత్తం భూమిని నిశితంగా పరిశీలించేందుకు 36,000 కి.మీ.లు జియో సింక్రనస్ ప్లాట్‌ఫారమ్‌లో ఉంచుతున్న మొట్టమొదటి ఉపగ్రహం ఇదే కావడం విశేషమని అన్నారు. జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ద్వారా ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడంపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ 'ఎక్స్' వేదికగా ఇస్రో బృందానికి అభినందనలు తెలిపారు. 'అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన మరో అతిపెద్ద పేలోడ్ ఇది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో భారతదేశ అంతరిక్ష సామర్థ్యాలు సరికొత్త శిఖరాలకు చేరుకుంటున్నాయి. ప్రపంచ అంతరిక్ష శక్తిగా మన దేశం బలపడుతోంది' అని ఎక్స్‌లో రాసుకొచ్చారు.

# కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

అదే స్థలంలో ఇప్పుడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నారు. ఆనాడు ముందు కొచ్చి భూములు ఇచ్చిన రైతులను గుర్తించి ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. దౌలతాబాద్ మండలం గోకఫసల్వాద్ చేరుకున్న సీఎం నిర్మాణంలో ఉన్న బీసీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులపై అధికారులను ఆరా తీశారు. అనంతరం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌లో ఎడ్యుకేషన్ హబ్‌కు సీఎం వెళ్లారు. ఒక్కో ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై ఆరా తీశారు. యంగ్ ఇండియా స్కూల్, ప్రభుత్వ మెడికల్ నర్సింగ్ స్కూల్ ఫిజియో థెరపీ, పారామెడికల్ కాలేజీల నిర్మాణాల వద్ద కలియ తిరుగుతూ వివరాలు తెలుసుకున్నారు. వర్షాల సమయంలో నీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్?ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి ల్యాండ్ స్కేపింగ్ పనులకు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. 430 పడకల ఆస్పత్రి పనులపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సమన్వయంతో పనులు చేయించాలని నాణ్యత, సాంకేతిక అంశాలు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలని ల్యాండ్ స్కేపింగ్ పనులకు వాడాలని సీఎం సూచించారు. అనంతరం కొండగల్ నియోజవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో పర్యటనల అనంతరం రోడ్డు మార్గాన కొడంగల్ నివాసానికి చేరుకుని రాత్రికి అక్కడే సీఎం బస చేయనున్నారు. రేపు కొడంగల్‌లో ప్రభుత్వాసుపత్రి ఆర్? అండ్ బీ గెస్ట్ హౌస్‌ను ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవు

**హైదరాబాద్,సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ నిర్ణయం బాధ కలిగించేదే అయినా, పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ చాలా తీవ్రంగా పరిగణించిందని మహేశ్ గౌడ్ తెలిపారు.

ఆమె వైఖరి అభ్యంతరకరంగా ఉం దని, అందుకే క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధా రంగా అధిష్ఠానం ఈ చర్యలు తీసుకుందని వివరిం చారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే చర్చించడానికి పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి వంటి అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని గుర్తుచేశారు.

వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. "కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు" అని ఆయన అన్నారు. అయితే, కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆమె పార్టీలో ఉంటే భవిష్యత్తులో తప్పకుండా అవకాశాలు లభిస్తా యని సూచనప్రాయంగా చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.



# కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమం లక్సెంబర్గ్ వెంచర్ డేస్-2026లో కీలకోపన్యాసం చేయాలని నిర్వాహకులు కేటీఆర్‌ను ఆహ్వానించారు. లక్సెంబర్గ్‌లో అక్టోబర్ 14, 15 తేదీల్లో జరిగే ఈ కార్యక్రమానికి తరఫున ఆహ్వానం అందింది. ఆసియా, యూరప్ దేశాల్లో పెట్టుబడుల విధానాలు ఎలా భిన్నంగా ఉంటాయి? పెట్టుబడిదారుల రిస్క్ తీసుకునే ధోరణి, స్టార్టప్ వ్యవస్థాపకుల అంచనాలు, పెట్టుబడి అవకాశాలు, అంతర్జాతీయ భాగస్వామ్యం వంటి అంశాలపై ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక సెషన్‌లో కేటీఆర్ మాట్లాడాలని నిర్వాహకులు కోరారు. భారత్‌ను అంతర్జాతీయ పెట్టుబడి, ఆవిష్కరణ వ్యవస్థలతో అనుసంధానించడంలో కేటీఆర్‌కు ఉన్న అనుభవం యూరప్‌లోని పెట్టుబడిదారులు, స్టార్టప్ వ్యవస్థాపకులకు ఉపయోగపడుతుందని తమ ఆహ్వానంలో నిర్వాహకులు పేర్కొన్నారు. భారత్, ఇతర అంతర్జాతీయ మార్కెట్ల మధ్య పెట్టుబడి సంబంధాలను పెంపొందించడంలో ఆయన దృక్పథం కీలకమని వారు అభిప్రాయపడ్డారు. యూరప్‌లోని ప్రముఖ పెట్టుబడిదారులు, వెంచర్ క్యాపిటల్ సంస్థలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, విధాన నిర్ణేతలు పాల్గొనే ఈ కార్యక్రమం స్టార్టప్ ఫైనాన్సింగ్, వ్యాపార వృద్ధిపై ప్రధానంగా దృష్టి సారిస్తుంది. గత ఏడాది జరిగిన లక్సెంబర్గ్ వెంచర్ డేస్‌కు 28 దేశాల నుంచి 3,400 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వారిలో 300 మందికిపైగా పెట్టుబడిదారులు, 110 వెంచర్ క్యాపిటల్ ఫండ్ల ప్రతినిధులు ఉన్నారు యూరప్‌కు చెందిన పలు ప్రముఖ వెంచర్ క్యాపిటల్ సంస్థలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి.

# తెలంగాణలో కొత్తగా చేయూత పించన్లు

- ఈ నెల 15 వరకు దరఖాస్తులు స్వీకరణ



**హైదరాబాద్,సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తులకు సంబంధించి మరో కీలక నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు సమయంలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోయినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు క్లారిటీ ఇచ్చారు. ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుల పరిశీలన సమయంలో మాత్రం కచ్చితంగా సమర్పించాలని సూచించారు. గీత కార్మికులకు ఆబ్కారీశాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరణ పత్రం లేకున్నా ఆధార్, రేషన్‌కార్డులతో దరఖాస్తు చేసుకోవచ్చు.ఒంటరి మహిళలకు తహసీల్దారు ధ్రువీకరణ పత్రం కావాలి.. దివ్యాంగులకు సదరం, యూడీఐడీ, చేనేత కార్మికులకు సంబంధిత శాఖ ఏడీ ధ్రువీకరణ పత్రం ఉండాలి. దరఖాస్తు సమయంలో ఈ ధ్రువీకరణ పత్రం లేకపోయినా పర్లేదని.. పరిశీలన సమయంలో మాత్రం సమర్పించాలని సూచించారు. గతంలో పింఛన్లు వచ్చి, ఆ తర్వాత ఆయా కారణాలతో ఆగిపోయిన వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. పరిశీలన సమయంలో మాత్రం ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువును కూడా పొడిగించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి జులై 31తోనే గడువు ముగిసింది.. కానీ సెప్టెంబర్ 15 వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు చేయని చాలామంది ఉన్నారు.. వారి అభ్యర్థన మేరకు గడువు పొడిగించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా 2.50 లక్షల మందికి కొత్త పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించింది. చేయూత పథకం కింద కొత్త సామాజిక పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆగస్టు 9వ తేదీ నుంచి 5 కేటగిరిల్లో దరఖాస్తులు తీసుకుంటున్నారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి ఎంపిక ప్రక్రియను పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో బిల్ కలెక్టర్లు నిర్వహిస్తారు. రాష్ట్రంలో చేయూత పథకం కింద కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఆగస్టు 30 వరకు మొత్తం 4.34 లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా 2.64 లక్షల మంది వితంతువుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. అయితే ప్రభుత్వం గడువు పెంచడంతో మరో 50వేలకుపైగా దరఖాస్తులు వస్తాయని అచంనా వేస్తున్నారు,

# విద్యార్థులను తీర్చిదిద్దడంలో టీచర్లదే కీలకపాత్ర

(మొదటి పేజీ తరువాయి)

పునాది వేయవచ్చని రాష్ట్రపతి పేర్కొన్నారు. అంకితభావంతో, శ్రద్ధతో పనిచేసే ఉపాధ్యాయుడు ప్రతి విద్యార్థిలోని ప్రత్యేక సామర్థ్యాన్ని గుర్తించి, వారిలో స్ఫూర్తిని నింపడంతో పాటు అత్యుత్తమ ప్రతిభను కనబరిచేలా ప్రోత్సహించగలరని ఆమె అన్నారు.ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తమ జ్ఞానాన్ని నవీకరించుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాలని, వినూత్న బోధనా పద్ధతులను అనుసరించాలని ముర్ము సూచించారు. విద్యార్థుల్లో స్వతంత్ర ఆలోచనా విధానాన్ని పెంపొందించడంతో పాటు ప్రశ్నించే, విషయాలను లోతుగా తెలుసుకోవాలనే ఆసక్తిని ప్రోత్సహించడం ఎంతో ముఖ్యమని ఆమె చెప్పారు. భారత మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు.

# ఢిల్లీలో కుండపోత వర్షం

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):**దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల మధ్యలో దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లైట్‌రాడార్24 డేటా ప్రకారం, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో రోజుకు 1,300కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమాన సర్వీసులపై ప్రభావం పడిందని ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు వేర్వేరుగా ప్రకటించాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నెమ్మదిగా ప్రయాణం సాగుతున్నందున, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని ఇండిగో కోరింది. ఎయిర్‌పోర్ట్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడిందని, తాజా సమాచారం కోసం ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం విజ్ఞప్తి (జీఎంఆర్) చేసింది. నీటిని తొలగించడానికి తమ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తీవ్ర వర్షపాతం నమోదవుతుందని హెచ్చరించింది. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# కొండా సురేఖను తొలగించారు

**హైదరాబాద్,సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):**తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమె త్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్‌లోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బందీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితా లోని పేదల భూ ములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ సమ స్యలపై ప్రశ్ని స్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవ మానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాం కు లు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

# 6న ఎర్రవల్లిలో బీఆర్ఎస్ పార్టీ శాసన సభా పక్ష భేటీ

- పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సమావేశం

**హైదరాబాద్,సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):**07 నుంచి రాష్ట్ర శాసన సభ సమావేశాలు ప్రారంభం కానున్ననేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ శాసన సభా పక్ష సమావేశం నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 06 న ఎర్రవల్లి నివాసంలో మధ్యాహ్నం 1 గంటకు లంచ్ అనంతరం 2 గంటలకు పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులతో కూడిన సంయుక్త సమావేశం జరగనున్నది. ఈ సమావేశానికి హాజరుకావాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశా నిర్దేశం చేయనున్నారు.

# కేసీఆర్ చాలా మంచోడు.. హుందాగా రిసీవ్ చేసుకునేవారు

(మొదటి పేజీ తరువాయి)


పనిచేసినన్ని రోజులు కేసీఆర్‌తో తమకు ఎలాంటి విభేదాలు రాలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం అడిగిన వెంటనే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. నాడు కొండా మురళికి ఎమ్మెల్సీ పీఠం దక్కకుండా పార్టీలోని కడియం శ్రీహరి వంటి కొందరు సీనియర్ నేతలు అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, కానీ కేసీఆర్ స్వయంగా జోక్యం చేసుకుని మిగిలిన వారి నామినేషన్లను ఉపసంహరింపజేసి మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చూశారని వెల్లడించారు. కాంగ్రెస్ నుంచి తీవ్ర అసంతృప్తితో, బర్తరఫ్ వేటుతో బయటకు వచ్చిన కొండా సురేఖ.. కేసీఆర్ పాలనను, ఆయన వ్యక్తిత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తడం వెనుక రాజకీయ ప్రాధాన్యత ఉందనే విశ్లేషణలు మొదలయ్యాయి. కేసీఆర్‌పై సురేఖ చేసిన సానుకూల వ్యాఖ్యల నేపథ్యంలో కొండా దంపతులు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి... బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందా? అనే ప్రచారం జోరందుకుంది.

# జుక్కల్ చౌరస్తా వద్ద బస్సు ప్రమాదం

**జుక్కల్,సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** జుక్కల్ చౌరస్తాలో వద్ద బస్సు ప్రమాదానికి గురైతంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ మృతి చెందగా, మరో 12 మంది గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారిలో ఒకరికి తలకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన క్షతగాత్రులకు బిచ్కుంద ఆసు పత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధి కారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు.

# పాడి గేదెల పెంపకంతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

**పరకాల, సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):**పాడి గేదెల పెంపకం ద్వారా పేద కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చి ఆర్థికంగా బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన దళిత కుటుంబాలకు 96 పాడి గేదెల యూనిట్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దళిత కుటుంబాల ఆర్థిక స్వావలంబన, జీవన ప్రమాణాల మెరుగుదల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పరకాల ఇందిరా మహిళా డైరీ ద్వారా రానున్న రెండేళ్లలో సుమారు 40 వేల కుటుంబాలకు ఇంటికి





రెండు గేదెల చొప్పున అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆత్మకూరు మండలానికి 72, దామెర మండలానికి 24 యూనిట్ల చొప్పున మంజూరు పత్రాలు అందించినట్లు చెప్పారు. ఒక్కో యూనిట్ విలువ రూ.2 లక్షలు కాగా, ఇందులో రూ.1.60 లక్షల సబ్సిడీ, రూ.40 వేల బ్యాంకు రుణం ఉంటుందని వివరించారు. పాడి గేదెల పెంపకాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అంతకుముందు పశువైద్యులు గేదెలకు అందించాల్సిన పోషకాహారం, వ్యాధుల నివారణ, టీకాలు, వైద్య పరీక్షలు, వాతావరణ మార్పుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే పాల ఉత్పత్తి పెరిగి కుటుంబాలకు మరింత ఆదాయం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# రైతులపై బీఆర్ఎస్‌కు ఇప్పుడు ఎందుకింత ప్రేమ?

### పదేళ్ల పాలనలో గుర్తుకురాని రైతుల సమస్యలు.. ఇప్పుడు రాజకీయాల కోసం మాట్లాడటం హాస్యాస్పదం: జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్

**ములుగు జిల్లా, సెప్టెంబర్ 4:(పిసిడబ్ల్యూ న్యూస్):** గోవిందరావుపేట మండల రైతుల సాగునీటి సమస్యపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలపై ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ తీవ్రంగా స్పందించారు. బీఆర్ఎస్ నాయకుల విమర్శలు కేవలం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవేనని ఆయన మండిపడ్డారు. "గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గోవిందరావుపేట మండల రైతులు మీకు గుర్తు రాలేదా? రైతుల సాగునీటి సమస్యలు మీకు కనిపించలేదా? పదేళ్లు అధికారంలో ఉండి రైతుల కోసం ఏం చేశారు?" అంటూ బీఆర్ఎస్ నాయకులను అశోక్ సూటిగా ప్రశ్నించారు. గోవిందరావుపేట మండల రైతులకు శాశ్వత సాగునీటి పరిష్కారం కల్పించేందుకు రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. లక్నవరం జలాశయానికి దేవాదుల ద్వారా



గోదావరి జలాలను తరలించే దిశగా రూ.33 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని, ఈ పనులు పూర్తయితే భవిష్యత్‌లో మండల రైతులకు సాగునీటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతుల సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని లక్నవరం జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలని మంత్రి సీతక్క ఇప్పటికే జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారని అశోక్ తెలిపారు. ప్రభుత్వం రైతుల సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్న సమయంలో బీఆర్ఎస్ నాయకులు కావాలనే రాజకీయ రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. "రైతులకు నీరు కావాలి.. రాజకీయాలు కాదు. రైతుల కన్నీళ్లు తుడవాలి.. రాజకీయ ప్రచారం చేయకూడదు. పదేళ్లు అధికారంలో ఉండి చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నప్పుడు అడ్డుపడటం ఎందుకు?" అని ఆయన ప్రశ్నించారు. ములుగు జిల్లాలోని ప్రతి మండల ప్రజల సమస్యలు, ప్రతి గ్రామంలోని ఇబ్బందులు, ప్రతి కుటుంబం ఎదుర్కొంటున్న సమస్యలు మంత్రి సీతక్కకు తెలుసని అశోక్ అన్నారు. ప్రజల మధ్య తిరుగుతూ వారి సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటికి శాశ్వత పరిష్కారాలు చూపించేందుకు మంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. సాగునీటి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించడంతో పాటు రూ.33 కోట్లతో గోదావరి జలాలను లక్నవరం జలాశయానికి తీసుకువచ్చే పనులు పూర్తయితే గోవిందరావుపేట మండల రైతులకు సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. "బీఆర్ఎస్ నాయకులారా.. పదేళ్లలో మీరు చేయనిది ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోంది. రైతులకు నీరు అందించడమే మా లక్ష్యం. రైతుల సమస్యల పరిష్కారమే మంత్రి సీతక్క గారి ధ్యేయం. అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. ఎవరు రైతుల కోసం పనిచేస్తున్నారో.. ఎవరు రైతుల పేరుతో రాజకీయాలు చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారు" అని పైడాకుల అశోక్ అన్నారు.

# విద్యార్థుల సమస్యలపై రాహుల్ గాంధీతో రాకేష్ దత్తా భేటీ

### ఓబిసి విద్యార్థుల సమస్యలపై కీలక చర్చ.. సమస్యల పరిష్కారానికి రాహుల్ గాంధీ హామీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4(పిసిడబ్ల్యూ న్యూస్):**విద్యార్థుల సమస్యలు, ఓబిసి విద్యార్థుల హక్కులు, సామాజిక న్యాయం అంశాలపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్సియు)విద్యార్థి నాయకుడు రాకేష్ దత్తా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో న్యూఢిల్లీలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఆల్ ఇండియా ఓబిసి స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో రాహుల్ గాంధీ విద్యార్థి నాయకులతో సమావేశమై వారి సమస్యలను సావధానంగా విన్నారు. ఈ సమావేశానికి హెచ్సియు స్టూడెంట్ లీడర్ రాకేష్ దత్తాను ప్రత్యేకంగా ఆహ్వానించగా, ఆయన తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఓ బి సి విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. **తెలంగాణ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఆవేదన:** తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన సుమారు రూ.10 వేల కోట్ల బకాయిల కారణంగా అనేక మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాకేష్ దత్తా వివరించారు. బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు తమ విద్యా సర్టిఫికెట్లు పొందలేకపోతున్న పరిస్థితిని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. **కులగణనతోనే ఓబిసిలకు సామాజిక న్యాయం:** దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాల్సిన అవసరాన్ని, ఓబిసి వర్గాలకు జనాభా ప్రాతిపదికన



తగిన సామాజిక న్యాయం, విద్యా మరియు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన ఆవశ్యకతను రాకేష్ దత్తా వివరించారు. ఎన్ఎఫ్-ఓబిసి ఫెలోషిప్‌లో కేవలం 1,000 స్లాట్లు మాత్రమే ఉండటం, నిధులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో పీహెచ్డీ విద్యార్థులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను కూడా ఆయన ప్రస్తావించారు. ఫెలోషిప్ స్లాట్లను పెంచడంతో పాటు నిధులను సకాలంలో విడుదల చేయాల్సిన అవసరాన్ని వివరించారు.

**సమస్యలను ఓపికగా విన్న రాహుల్ గాంధీ**రాకేష్ దత్తా లేవనెత్తిన అంశాలను రాహుల్ గాంధీ సుమారు 45 నిమిషాల పాటు సావధానంగా విన్నారని తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ రాకేష్ దత్తా పక్కనే కూర్చొని, భుజంపై చేయి వేసి విద్యార్థుల సమస్యలపై ఆత్మీయంగా చర్చించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ ఫీజు రీయింబర్స్‌మెంట్ సహా రాకేష్ దత్తా ప్రస్తావించిన అంశాలపై తన పీఏకు వెంటనే సూచనలు ఇచ్చారని, తెలంగాణ ముఖ్యమంత్రితో త్వరలో జరిగే భేటీలో ఈ సమస్యలను ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్లు రాకేష్ దత్తా తెలిపారు. సమావేశం అనంతరం రాకేష్ దత్తా అభ్యర్థన మేరకు రాహుల్ గాంధీ ఆయన షర్టుపై గుండె భాగంలో ఆప్యాయంగా రాహుల్ గాంధీ అని సంతకం చేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీతో జరిగిన భేటీ విద్యార్థుల సమస్యలను జాతీయ స్థాయిలో ప్రస్తావించేందుకు కీలక వేదికగా నిలిచిందని రాకేష్ దత్తా పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఐఓబిసిఎస్ఎ జాతీయ అధ్యక్షుడు కిరణ్ కుమార్, ఓయూ విద్యార్థులు జయంత్ యాదవ్, రజనీకాంత్ గౌడ్, దీపక్, జేఎన్టీయూ విద్యార్థులు పుష్ప రాజ్ దీపా, శశి, రాకేష్ కుమార్, పింకీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

- విద్యార్థులకు ధర్మమార్గాన్ని బోధించిన శ్రీకృష్ణుని జీవితం
- సోషల్ జస్టిస్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు సాంబయ్య యాదవ్






**హనుమకొండ, సెప్టెంబర్ 04(పిసిడబ్ల్యూ న్యూస్):** హన్మకొండ సుభేదారిలోని కాకతీయ హైస్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. పాఠశాల కరెస్పాండెంట్, సోషల్ జస్టిస్ ఫోరం హన్మకొండ జిల్లా అధ్యక్షుడు దామెరుప్పుల శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకలకు సోషల్ జస్టిస్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఏశబోయిన సాంబయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లోకకళ్యాణం కోసం, అధర్మాన్ని రూపమాపేందుకు శ్రీకృష్ణుడు శ్రావణ అష్టమి నాడు జన్మించారని తెలిపారు. దేవకి, వసుదేవుల ఎనిమిదవ సంతానంతో కంసునికి మరణం తప్పదని ఆశరీరవాణి చెప్పిన హెచ్చరికలను గుర్తుచేస్తూ... పసిపిల్లలను చంపేందుకు కంసుడు పూతన అనే విషకన్యను పంపినా, చివరికి ఆ శ్రీకృష్ణుడి చేతిలోనే పూతనతో పాటు కంసుడు కూడా అంతమయ్యాడని పేర్కొన్నారు. శ్రీకృష్ణ భగవానుడు ఎల్లప్పుడూ ధర్మం, న్యాయం, పాండవుల హక్కుల కోసమే నిలబడ్డారని సాంబయ్య యాదవ్ వివరించారు. కురు-పాండవుల మధ్య శాంతి, ఐక్యత నెలకొల్పేందుకు కృష్ణుడు చివరివరకు ప్రయత్నించారని, కానీ దుర్యోధనుడి అహంకారం వల్లే మహాభారత యుద్ధం అనివార్యమైందని తెలిపారు. విద్యార్థులు శ్రీకృష్ణుని జీవితం నుండి ధర్మం, న్యాయం, సహనం అనే గుణాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయ వేదిక గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు జున్ను సదానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల పెద్ద రవి, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వరలక్ష్మీ వ్రత పూజలో పాల్గొన్న మల్లారెడ్డి, రవీందర్ యాదవ్






**హనుమకొండ, సెప్టెంబర్ 04( పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రావణమాసాన్ని పురస్కరించుకుని వరంగల్ ఓడిసిఎంఎస్ మాజీ వైస్ చైర్మన్, ధర్మారం గ్రామ మాజీ సర్పంచ్, క్లస్టర్ ఇంచార్జ్ గోల్కొండ సదానందం - ఉమాదేవి దంపతుల హనుమకొండ నివాసంలో వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గోల్కొండ సదానందం దంపతుల ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పర్నెం మల్లారెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, నార్లపూర్ సర్పంచ్ పెద్దబోయిన రవీందర్ యాదవ్ హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్నెం మల్లారెడ్డి, రవీందర్ యాదవ్ మాట్లాడుతూ... పవిత్రమైన శ్రావణమాసంలో వరలక్ష్మీ వ్రత పూజలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. ఆ వరలక్ష్మీ దేవి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖశాంతులతో విలసిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం వేడుకను విజయవంతంగా నిర్వహించిన గోల్కొండ సదానందం - ఉమాదేవి దంపతులకు శాలువాతో సత్కరించి, వారిని ఆశీర్వదించారు.

# ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహానికి స్థలం కేటాయించండి

### - వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డికి ప్రజా సంఘాల వినతి



**హనుమకొండ, సెప్టెంబర్ 04( పిసిడబ్ల్యూ న్యూస్):** హన్మకొండ జిల్లా కేంద్రంలో ప్రజాయుద్ధ నౌఖ గద్దరన్న విగ్రహం ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని కోరుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. హనుమకొండ జిల్లా కలెక్టర్ కు ప్రజా సంఘాల నాయకులు ఇచ్చిన వినతిపత్రాన్ని వెంటనే ఎమ్మెల్యే ఫార్వర్డ్ చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఏర్పాటులో గద్దరన్న పాత్ర కీలకమైందని అలాంటి గద్దరన్న ఆశయ సాధనలో భాగంగా ఆయన విగ్రహాలను రాష్ట్రమంతా ఏర్పాటు చేసుకొని పీడిత ప్రజల విముక్తిలో భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గద్దర్ విగ్రహ స్థాపన కమిటి చైర్మన్ కోండ్ర నర్సింగరావు, బిసి జాక్ నాయకులు డాక్టర్ తిరునహరి శేషు, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, డి బి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, గజాల గోవర్ధన్, గద్దర్ సాంబయ్య, పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేరళ పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు





**జమ్మికుంట, సెప్టెంబర్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** జమ్మికుంట కేరళ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి, జన్మాష్టమి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ కె.ఎస్. బెన్ని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. చిన్నారులను శ్రీకృష్ణుడు, రాధ తదితర వేషధారణలతో అలంకరించి ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పాఠశాల యాజమాన్యం చేపడుతున్న కార్యక్రమాలపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఆహ్లాదకర వాతావరణంలో జరిగిన వేడుకల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

## వధువు రుతికను ఆశీర్వదించిన మంత్రి సీతక్క.. హల్దీ వేడుకలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు



**మల్లంపల్లి, సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు గారి తమ్ముడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ల్యాద రజిని లక్ష్మణరావు గారి కుమార్తె రుతిక హల్దీ ఫంక్షన్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్ర మంత్రి శ్రీమతి దనసరి అనసూయ సీతక్క హాజరై రుతికను ఆశీర్వదించారు. నూతన జీవితంలో అడుగుపెడుతున్న రుతికకు మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మంత్రిని సాదరంగా ఆహ్వానించారు. హల్దీ వేడుకలో మంత్రి సీతక్క పాల్గొని వధువు రుతికకు ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, ములుగు జిల్లా కిసాన్ సెల్ కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్, మల్లంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీకాంత్‌రెడ్డి, మెడికల్ హెల్త్ వింగ్ ములుగు జిల్లా చైర్మన్ ఆనందపు రవిబాబు, మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు, డీసీసీ ప్రధాన కార్యదర్శి కాగితోజు దేవేంద్రచారి, మల్లంపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు పొనుగంటి రవీందర్, ఉపసర్పంచ్ అంకం సురేష్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకులు మూల గణేష్‌రెడ్డి, కక్కర్ల సాంబయ్య, గొర్రె కుమార్‌స్వామి, ఎడ్ల అనిల్‌రెడ్డి, మల్లంపల్లి వార్డు సభ్యులు చిన్నబోయిన మహేందర్, గొళ్లేనా సారంగపాణి, జింక వేణు, దయ్యాల చంద్రమౌళి, కొంగరి నరేందర్, పంజాల సురేష్, కూచన సురేష్‌తో పాటు నియోజకవర్గ, జిల్లా సీనియర్ నాయకులు, యువజన నాయకులు, ప్రజాప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి హబ్సిగూడ డివిజన్ కన్వీనర్‌గా చింతకింది ప్రవీణ్

### - వైభవంగా గణేష్ ఉత్సవాల నిర్వహణే లక్ష్యం: చింతకింది ప్రవీణ్





**ఉప్పల్ సెప్టెంబర్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి హబ్సిగూడ డివిజన్ కన్వీనర్‌గా చింతకింది ప్రవీణ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రామంతపూర్ గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపకులు తిండేరు హనుమంతరావు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ కన్వీనర్ ఏనుగు రాజిరెడ్డి, సెంట్రల్ కమిటీ సభ్యులు రమేష్ తదితరులు ప్రవీణ్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకంతో హబ్సిగూడ డివిజన్ కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించిన సమితి పెద్దలకు, నాయకులకు చింతకింది ప్రవీణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డివిజన్ పరిధిలో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో, ఘనంగా మరియు వైభవంగా నిర్వహించేందుకు అందరినీ కలుపుకొని కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. అలాగే గణేష్ ఉత్సవాల సందర్భంగా ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, ఉత్సవాలు ప్రశాంతంగా, క్రమశిక్షణతో జరిగేలా సమితి సభ్యులు, నిర్వాహకులు మరియు భక్తులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు రుద్ర శేఖర్, మాలకొండ రెడ్డి, సోమ శ్రీనివాస్ గుప్త, రామేశ్వరరావు, ఓబుల్ రెడ్డి, చెల్లోజు ఎల్లాచారి, వార్ల బాలరాజు, రాపోలు సాయినాథ్, కొండేరు స్రవంతి తదితరులు పాల్గొని చింతకింది ప్రవీణ్‌కు అభినందనలు తెలిపారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై పెనుబల్లిలో బీఆర్ఎస్ సమరశంఖం

### మహిళలతో భారీ ర్యాలీ.. వంటా వార్పుతో నిరసన

### బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య





**పెనుబల్లి, సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తీవ్రంగా మోసం చేస్తోందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ బీఆర్ఎస్ చేపట్టిన 1000 రోజుల కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా పెనుబల్లి మండల కేంద్రంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. సండ్ర వెంకట వీరయ్య నాయకత్వంలో పెనుబల్లి గెస్ట్‌హౌస్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వేలాది మంది మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. దీంతో పెనుబల్లి వీధులన్నీ గులాబీమయంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మహిళలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రహదారిపై వంటా వార్పు నిర్వహించి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని, ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు గడిచినా ఆ హామీలను అమలు చేయలేదు అని మండిపడ్డారు. విద్యార్థినులకు స్కూటీలు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద తులం బంగారం, అర్హులందరికీ ఇళ్లు, పెన్షన్ల పెంపు వంటి హామీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రజల్లోకి వచ్చి పోరాటం ప్రారంభిస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళలు, ప్రజల సంక్షేమం గుర్తుకు వస్తోంది అని సండ్ర ఎద్దేవా చేశారు. పెనుబల్లిలో బీఆర్ఎస్ వంటా వార్పు కార్యక్రమానికి పిలుపునిచ్చిన వెంటనే కాంగ్రెస్ నాయకులు హడావుడిగా చీరల పంపిణీకి తెరలేపడం ఇందుకు నిదర్శనమన్నారు. పాలనపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం సరికాదని సండ్ర అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని, ప్రతిపక్షాలపై నిందలు వేయడం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం కావని హితవు పలికారు. 6 గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని సండ్ర వెంకట వీరయ్య స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతామని తెలిపారు. పెనుబల్లి వేదికగా మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ గళాన్ని బలంగా వినిపించడం పట్ల సండ్ర వెంకట వీరయ్య హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు

# మహిళలు ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులవ్వాలి

### మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇందిర మహిళాశక్తి పథకం అండ

### మహిళా సంఘాలకు అండగా ప్రభుత్వం..

### వడ్డీలేని రుణాలు, ఉపాధి అవకాశాలు

### సత్తుపల్లిలో ఇందిర మహిళాశక్తి సదస్సులో పాల్గొని మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేసిన మంత్రి సీతక్క





**సత్తుపల్లి, సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా స్వతంత్రంగా జీవిస్తూ, ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులుగా మారాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మహిళల చేతుల్లో డబ్బు ఉండాలని, తమకు నచ్చిన విధంగా జీవించే ఆర్థిక స్వేచ్ఛను కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. శుక్రవారం సత్తుపల్లి పట్టణంలోని సిద్ధారం రోడ్డులో గల ఎం.ఆర్. గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో 1000 రోజుల ప్రజా పాలనలో భాగంగా నిర్వహించిన ఇందిర మహిళాశక్తి సదస్సులో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లతో కలిసి పాల్గొన్నారు. మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళలు పెద్ద ఎత్తున ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరవుతున్నారంటే ప్రభుత్వంపై వారికి ఉన్న ప్రేమ, విశ్వాసానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను కుటుంబ సభ్యులుగా భావిస్తూ, వారి ఆర్థిక స్వావలంబనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని మంత్రి తెలిపారు. మహిళలు తమకు నచ్చిన వ్యాపారాలను ప్రారంభించి, స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు. ఇందుకోసం మహిళా సంఘాలకు ఏపీఎంలు, డీఆర్‌డీఓ అధికారులు అవసరమైన సహకారం అందిస్తారని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి గత రెండున్నరేళ్లలో పంచాయతీరాజ్, మహిళా సంఘాల సంక్షేమం, తాగునీరు తదితర రంగాల్లో సుమారు రూ.300 కోట్ల వరకు నిధులు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి పల్లె, గూడెం, తండా, వాడలో అవసరమైన సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఁహిళా సంఘాలు కేవలం పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలోకి రావాలని మంత్రి పిలుపునిచ్చారు. మహిళా అర్థిక పురోగతికి కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి మేడారం జాతర సందర్భంగా మహిళా సంఘాలకు సుమారు రూ. 6 కోట్ల మేర రుణ సహాయం అందించగా, మహిళలు కేవలం 15 రోజుల్లోనే సుమారు రూ.9 కోట్ల వ్యాపారం చేసి లాభాలు ఆర్జించారని గుర్తుచేశారు.త్తుపల్లిలో కూడా టిఫిన్ సెంటర్లు, క్యాంటీన్లు, డెయిరీ, పౌల్ట్రీ, సోలార్, కుట్టు యూనిట్లు, స్థానికంగా లభించే అటవీ ఉత్పత్తుల ఆధారంగా వివిధ వ్యాపారాలు ప్రారంభించాలని సూచించారు. స్థానికంగా లభించే ఉత్పత్తులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి విక్రయిస్తే మహిళలకు మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, కలెక్టరేట్లు, ఇతర ప్రజలు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో మహిళా సంఘాలతో ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో మహిళలు క్యాంటీన్ల ద్వారా నెలకు రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు ఆదాయం పొందుతున్నారని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, రుణాలపై వడ్డీ భారాన్ని ప్రభుత్వం భరిస్తోందన్నారు.

మహిళా సంఘాల సభ్యులకు రుణ బీమా సదుపాయం కల్పిస్తూ, రుణం తీసుకున్న సభ్యురాలు మరణించిన సందర్భంలో నిర్దిష్ట పరిమితి వరకు రుణాన్ని మాఫీ చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళల కోసం ప్రమాద బీమా, లోన్ బీమా వంటి సౌకర్యాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని, లోన్ బీమా కింద ఇప్పటికే సుమారు 870 మంది సభ్యులకు ప్రయోజనం అందించామని ఎమ్మెల్యే తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు వ్యాపార అవకాశాలు, సోలార్ యూనిట్లు, ఇతర ఉపాధి కార్యక్రమాలు మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దుతున్నాయని అన్నారు. సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ రెహ్మాన్ బేగం, కల్లూరు ఎసీపీ వసుందర, సత్తుపల్లి మున్సిపల్ కమీషనర్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా 'టీ-సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రాల' ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్, సెప్టెంబర్ 04(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో 'టీ-సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రాల' ఏర్పాటుకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా మరియు నగర స్థాయిలలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కేంద్రాల ద్వారా పౌరులకు బహుళ సేవలు అందుబాటులోకి వస్తాయి:ఆన్‌లైన్ & బ్యాంకింగ్ సేవలు: కొత్త పాన్ కార్డుల జారీ, సవరణలు, మనీ ట్రాన్స్‌ఫర్, ఆధార్ ఆధారిత నగదు చెల్లింపులు, మైక్రో ఏటీఎం, క్యాష్ డిపాజిట్లు, నూతన బ్యాంక్ ఖాతాల ప్రారంభం. రిజర్వేషన్ & బిల్లుల చెల్లింపులు: బస్సు, రైలు, విమాన టికెట్ల బుకింగ్, విద్యుత్ తదితర బిల్లుల చెల్లింపులు, కొరియర్ సేవలు. ఇన్సూరెన్స్ & ఫైనాన్షియల్ సేవలు: హెల్త్, బైక్, కార్ ఇన్సూరెన్స్ పాలసీలు, వ్యక్తిగత రుణాలు, డిజిటల్ బంగారం కొనుగోలు సదుపాయం. విద్య & నైపుణ్యాభివృద్ధి శిక్షణ: కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన 100కు పైగా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ, స్కిల్ టెస్ట్ సర్టిఫికేషన్ నమోదు మరియు 100కు పైగా ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు మాక్ టెస్ట్ రిజిస్ట్రేషన్ కేంద్రంగా ఇవి పనిచేస్తాయి. వినియోగదారులకు విస్తృత ఆన్‌లైన్ సేవలను అందిస్తూ అభ్యర్థులు గౌరవప్రదమైన స్వయం ఉపాధిని పొందవచ్చని డైరెక్టర్ సూచించారు. ఆసక్తి గలవారు www.tsevaonline.com వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 8179955744 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.




# అంబేద్కర్ ఒక వ్యక్తి మాత్రమే కాదు - సమాజంలోని అసమానతలను ప్రశ్నించిన ఒక చారిత్రక మహోన్నత శక్తి

## - అంబేద్కర్‌ను 'కల్పితం' చేయాలనుకునేవారు మనుస్మృతిని ఎందుకు మరిచిపోతున్నారు?

మహాద్ నుంచి మనుస్మృతి దహనం వరకు సాగిన అంబేద్కర్ పోరాటాన్ని నిరాకరించడం అంటే ఆయనను మాత్రమే కాదుఆయనను సృష్టించిన సామాజిక వాస్తవాన్నే నిరాకరించడండా. బి.ఆర్. అంబేద్కర్‌ను లక్ష్యంగా చేసుకుని 'కల్పిత నాయకుడు' అనే వాదన ముందుకు వస్తున్న నేపథ్యంలో ఒక మౌలిక ప్రశ్నను అడగాల్సిన అవసరం ఉంది. అంబేద్కర్ నిజంగా 'కల్పిత నాయకుడు' అయితే, ఆయన నాయకత్వాన్ని సృష్టించిన సామాజిక వాస్తవం ఏమిటి? పుట్టుక ఆధారంగా మనుషుల మధ్య ఉన్నతనీచ భేదాలు, అంటరానితనం, ప్రజా వనరులపై అసమాన హక్కులు, విద్య ఉపాధి రాజకీయ ప్రాతినిధ్యంలో వివక్ష వంటి పరిస్థితులు ఎందుకు ఉన్నాయి? ఆ వాస్తవాలపై పోరాడిన లక్షలాది పీడిత ప్రజల చరిత్రను కూడా కల్పితంగానే పరిగణించాలా?అంబేద్కర్ నాయకత్వం ఏదో వ్యక్తిగత ప్రచారంతో ఏర్పడలేదు. అది భారతీయ కులవ్యవస్థలోని తీవ్రమైన అసమానతల మధ్య నుంచి ఎదిగింది. ఆయన స్వయంగా ఎదుర్కొన్న వివక్ష, ఆయనతో కలిసి ఉద్యమించిన ప్రజల అనుభవాలు, సమాన హక్కుల కోసం సాగిన సామాజిక పోరాటాలు ఆయన నాయకత్వానికి పునాది. అందువల్ల అంబేద్కర్‌ను అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆయన జీవించిన కాలంలోని సామాజిక వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి. ఈ నేపథ్యంలో 1927లో మహారాష్ట్రలోని మహాద్ లో జరిగిన చావ్దార్ చెరువు సత్యాగ్రహం అత్యంత ప్రాధాన్యమైన సంఘటన. ప్రజా నీటి వనరును దళితులు ఉపయోగించడాన్ని నిరాకరించే సామాజిక ఆచారాన్ని అంబేద్కర్ సవాలు చేశాడు. ఇది నీటి కోసం జరిగిన పోరాటంగా కనిపించినప్పటికీ, దాని అసలు ప్రశ్న మానవ గౌరవం మరియు సమాన పౌర హక్కుల గురించి ప్రశ్న. ఒక ప్రజా చెరువు నుంచి నీళ్లు తాగే హక్కు కూడా పుట్టుక ఆధారంగా నిర్ణయించబడితే, సమాజంలో సమానత్వం ఎక్కడ ఉందన్న ప్రశ్నను మహాద్ ఉద్యమం ముందుకు తెచ్చింది.మహాద్ పోరాటం అక్కడితో ఆగలేదు. 1927 డిసెంబర్‌లో జరిగిన రెండో మహాద్ సదస్సులో అంబేద్కర్ ఉద్యమం సామాజిక అసమానత మూలాలను ప్రశ్నించే దిశగా మరింత ముందుకు వెళ్లింది. చావ్దార్



చెరువు పై న్యాయపరమైన వివాదం కారణంగా వెంటనే నీటిని ఉపయోగించే కార్యక్రమం చేపట్టలేకపోయినా, సామాజిక సమానత్వం కోసం పోరాటం కొనసాగింది. అదే సందర్భంలో డిసెంబర్ 25న మనుస్మృతి దహనం జరిగింది.మనుస్మృతి దహనాన్ని కేవలం ఒక గ్రంథాన్ని కాల్చిన చర్యగా అర్థం చేసుకోవడం దాని చారిత్రక, రాజకీయ అర్థాన్ని కుదించడం అవుతుంది. అంబేద్కర్ దృష్టిలో అది పుట్టుక ఆధారంగా మనుషుల మధ్య అంతరాలను సమర్థించే సామాజిక నైతికతకు వ్యతిరేకమైన ప్రతీకాత్మక నిరసన. ఒక నియమం పురాతనమైనదని మాత్రమే అది న్యాయమైనదిగా మారదు. ఒక సంప్రదాయం మానవ గౌరవానికి విరుద్ధంగా ఉంటే, దాన్ని ప్రశ్నించే హక్కు ప్రతి మనిషికీ ఉంది. ఇదే అంబేద్కర్ ఆలోచనలోని మౌలిక సవాలు.అంబేద్కర్ ప్రశ్నించింది ఏ వ్యక్తినో కాదు; అన్యాయాన్ని శాశ్వతం చేసే సామాజిక నిర్మాణాన్ని. అంటరానితనం ఆయన దృష్టిలో ఒక ప్రత్యేక దురాచారం మాత్రమే కాదు; పుట్టుక ఆధారంగా మనుషులను విభజించే కులవ్యవస్థలోని ఒక రూపం. అందుకే ఒక బావి, ఒక దేవాలయం లేదా ఒక ప్రజా చెరువుపై హక్కు సాధించడం మాత్రమే అంతిమ లక్ష్యం కాదు. మనిషి పుట్టుకే అతని సామాజిక స్థానం, గౌరవం, హక్కులను నిర్ణయించే వ్యవస్థను మార్చడమే అసలు సవాలు.ఇక్కడే మహాద్ ఉద్యమం యొక్క విస్తృతమైన అర్థం కనిపిస్తుంది. అది నీటి హక్కు నుంచి మానవ గౌరవానికి, మానవ గౌరవం నుంచి సమాన పౌర హక్కులకు, అక్కడి నుంచి కుల నిర్మూలన అనే ప్రశ్నకు దారితీసింది. అంబేద్కర్ పోరాటాన్ని ఈ సామాజిక పరిణామ క్రమంలో చూడకుండా ఒకే సంఘటనకు పరిమితం చేయడం ఆయన ఆలోచనను అర్థం చేసుకోకపోవడమే.మనుస్మృతి దహనం కేవలం తిరస్కరణకు ప్రతీక కాదు; దానికి ప్రత్యామ్నాయం ఏమిటో కూడా అంబేద్కర్ ఆలోచనలో స్పష్టంగా ఉంది. పుట్టుక ఆధారిత ప్రత్యేక హక్కులకు బదులుగా సమాన పౌర హక్కులు, అంటరానితనానికి బదులుగా మానవ గౌరవం, కుల వివక్షకు బదులుగా సమానత్వం, సామాజిక బహిష్కరణకు బదులుగా సోదరభావం, ఆధిపత్యానికి బదులుగా సామాజిక న్యాయంఇవే ఆయన ప్రతిపాదించిన ఆధునిక ప్రజాస్వామిక విలువల కేంద్రం.అందుకే అంబేద్కర్‌ను 'కల్పిత నాయకుడు' అని పిలిచే ముందు సామాజిక అసమానతలకు కారణమైన ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. మహాద్ సత్యాగ్రహం కల్పితమా? చావ్దార్ చెరువు హక్కు కోసం జరిగిన పోరాటం కల్పితమా? మనుస్మృతి దహనం కల్పితమా? అంటరానితనానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలు కల్పితమా? కుల నిర్మూలనపై అంబేద్కర్ చేసిన రచనలు కల్పితమా? రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటాలు కూడా కల్పితమేనా? చరిత్రలో నమోదైన సంఘటనలను ఒక రచయితకు నచ్చని కారణంతో చెరిపివేయలేం.అయితే అంబేద్కర్‌ను విమర్శించకూడదని చెప్పడం కూడా సరైనది కాదు. ప్రజాస్వామ్యంలో అంబేద్కర్‌తో సహా ప్రతి చారిత్రక వ్యక్తినీ ప్రశ్నించవచ్చు. ఆయన రాజకీయ నిర్ణయాలను విమర్శించవచ్చు, ఆయన వ్యూహాలతో విభేదించవచ్చు, ఆయన ఆలోచనలను పునఃపరిశీలించవచ్చు. కానీ విమర్శకు ఆధారం ఉండాలి; సందర్భాన్ని వక్రీకరించకూడదు. అంబేద్కర్ ఏం చెప్పాడు, ఎప్పుడు చెప్పాడు, ఏ పరిస్థితుల్లో చెప్పాడు అనే విషయాలను పరిశీలించకుండా చేసే తీర్పు చారిత్రక విమర్శ కాదు.అసలు వివాదం అంబేద్కర్ వర్సెస్ ఒక రచయిత అనే స్థాయిలో లేదు. ఇది భారతీయ సమాజాన్ని ఏ విలువలతో అర్థం చేసుకోవాలనే ప్రశ్న. పుట్టుక ఆధారిత మనుషుల విభజనను సంప్రదాయం పేరుతో కాపాడాలా? లేక మానవ సమానత్వాన్ని సామాజిక న్యాయానికి ప్రమాణంగా స్వీకరించాలా? ఈ రెండు దృక్పథాల మధ్య ఉన్న సంఘర్షణే అంబేద్కర్ చరిత్రను నేటికీ రాజకీయంగా, సామాజికంగా ప్రాసంగికంగా ఉంచుతోంది.అంబేద్కర్‌ను 'కల్పితం' చేయాలనుకునేవారు ముందుగా ఆయనను సృష్టించిన సామాజిక వాస్తవాన్ని ఎదుర్కోవాలి. మహాద్ లో సమాన హక్కుల కోసం పోరాడిన ప్రజలను, అంటరానితనాన్ని అనుభవించిన తరాలను, కుల వివక్ష కు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాలను, సామాజిక న్యాయం కోసం జరిగిన పోరాటాలను చరిత్ర నుంచి తొలగించకుండా అంబేద్కర్‌ను మాత్రమే తొలగించడం సాధ్యం కాదు. 1927 డిసెంబర్ 25న మహాద్ లో జరిగిన మనుస్మృతి దహనం అందుకే ఒక చారిత్రక ప్రతీకగా నిలిచింది. అది "పురాతనమైనదంతా పవిత్రమే" అనే భావనకు సవాలు చేసి, "న్యాయం కానిది ఎంత పురాతనమైనదైనా ప్రశ్నించాల్సిందే" అనే విలువను ముందుకు తెచ్చింది. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా అంబేద్కర్‌ను 'కల్పిత నాయకుడు'గా ప్రకటించడం చరిత్రను పునఃపరిశీలించడం కాదు; చరిత్రలోని మనిషిని మనిషిగా గుర్తించని సామాజిక వాస్తవం నుంచి తప్పించుకోవడమే.అందుకే నేటి అసలు ప్రశ్న "అంబేద్కర్ కల్పిత నాయకుడా?" అనేది కాదు. "అంబేద్కర్ ఎందుకు పుట్టాల్సి వచ్చింది?" అనేదే. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే భారతీయ కులవ్యవస్థ చరిత్రను, అంటరానితనాన్ని, సామాజిక అసమానతలను, మానవ గౌరవం కోసం సాగిన పోరాటాలను ఎదుర్కోవాలి. అంబేద్కర్‌ను నిరాకరించడం సులభం కావచ్చు; కానీ అంబేద్కర్ సృష్టించిన సామాజిక వాస్తవాన్ని నిరాకరించడం అంత సులభం కాదు.అంబేద్కర్ ఒక వ్యక్తి మాత్రమే కాదుభారతీయ సమాజంలోని అసమానతలను ప్రశ్నించిన ఒక చారిత్రక శక్తి. ఆయనను విమర్శించవచ్చు; ఆయనతో విభేదించవచ్చు. కానీ ఆయనను అర్థం చేసుకోకుండా 'కల్పితం' చేయడం మాత్రం చరిత్రపై విమర్శ కాదుచరిత్ర నుంచి తప్పించుకునే ప్రయత్నం.



- ద్వారం సుజాత మహ్మద్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సిపిఐ(ఎంఎల్)రెడ్ స్టార్‌సెల్: 82477 84897

---

# మల్లంపల్లిలో బీఆర్ఎస్ వంటా వార్పు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర నిరసన



### ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలు అమలు చేయాలని డిమాండ్

### జాతీయ రహదారి163పై అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా

### హామీలు నెరవేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ హెచ్చరిక

**మల్లంపల్లి మండల ప్రతినిధి సెప్టెంబర్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నప్పటికీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మల్లంపల్లి మండల కేంద్రంలో వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారి163పై అంబేద్కర్ విగ్రహం ఎదుట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. వంటా వార్పు నిర్వహిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో ఆ ప్రాంతంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది.**హామీల అమలులో ప్రభుత్వం విఫలం** బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో తీవ్ర జాప్యం చేస్తోందని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను ప్రజలకు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం అప్పగించారని, అయితే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హామీల అమలుకు స్పష్టమైన కార్యాచరణ కనిపించడం లేదని అన్నారు. హామీల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు.**రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్** రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన రైతులకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ఎన్నికల సమయంలో ప్రకటించిన పథకాలు, హామీలను ఎలాంటి ఆలస్యం లేకుండా అమలు చేయాలని కోరారు.రైతులకు సంబంధించిన సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం వ్యవహరిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల నుంచి మరింత వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.**మహిళలు, యువత, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి** మహిళలకు, యువతకు, నిరుద్యోగులకు, పేదలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్యంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలని కోరారు.మహిళలకు ఇచ్చిన హామీలను కూడా పూర్తిస్థాయిలో అమలు చేయాలని, పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి పాలన సాగించాల్సిన ప్రభుత్వం హామీల అమలులో జాప్యం చేయడం సరికాదని విమర్శించారు.**ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం** మల్లంపల్లి మండలంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రజా సమస్యలు ఉన్నప్పటికీ వాటి పరిష్కారానికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా వాటి పరిష్కారంలో జాప్యం జరుగుతోందన్నారు.ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేవలం ప్రచారానికి పరిమితం చేయకుండా వాటిని ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు.**ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చ రించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని నాయకులు తేల్చిచెప్పారు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని, హామీల అమలుపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ భవిష్యత్‌లో మరిన్ని నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

---

# కరీంనగర్- చొప్పదండి వాహనదారులకు ఊరట





### తీగలగుట్టపల్లి ఆర్వోబీ వద్ద తారు రోడ్డు నిర్మాణం

### కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో రోడ్డు నిర్మాణం

### ఆర్వోబీ నిర్మాణంపై 2028 వరకు కాంట్రాక్టర్‌కు గడువు ఉండటంతో తాత్కాలిక చర్యలు

**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 04 (పిసి డబ్ల్యూ న్యూస్):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవ ఫలించింది. కరీంనగర్ లోని తీగలగుట్టపల్లి వద్ద ఆర్వోబీ నిర్మాణంలో తీవ్రమైన జాప్యం జరుగుతుండటం, ఈ ఆర్వోబీ నిర్మాణం పూర్తి విషయంలో 2028 వరకు కాంట్రాక్టర్ కు గడువు ఉండటంతో అటువైపుగా వెళ్లే వాహనదారులు గత కొంతకాలంగా తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. దీనిని ద్రుష్టిలో ఉంచుకుని ఆర్వోబీ వద్ద వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా తారు రోడ్డును నిర్మించాలని స్థానిక ప్రజలు ఎప్పటి నుండో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో అటువైపు వెళ్లే వాహనదారుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవ తీసుకుని మున్సిపల్ నిధులతో ఆర్వోబీ వద్ద రోడ్డును యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులను సూచించారు. కేంద్ర మంత్రి సూచన మేరకు మేయర్ కొలగాని శ్రీనివాస్ రూ.28 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో యుద్ధ ప్రాతిపదికన రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణంతో అటువైపు వెళ్లే వాహనదారులకు కొంత ఉపశమనం కలగనుంది. మరోవైపు తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణంలో గత బీఆర్ఎస్ పాలనలో తీవ్ర జాప్యం జరిగింది. నిధుల కేటాయింపులో కేంద్ర, రాష్ట్రాల వాటా ఉన్నప్పటికీ నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం తన వాటా నిధులను చెల్లించలేదు. అయినప్పటికీ నాడు బండి సంజయ్ చొరవ తీసుకుని కేంద్రాన్ని ఒప్పించి ఆర్వోబీ నిర్మాణానికయ్యే రూ.156 కోట్ల మొత్తాన్ని కేంద్రం నుండి మంజూరు చేయించారు. ఆ తరువాత భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అయినప్పటికీ, ఈ విషయంలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. ఆ తరువాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణను వేగవంతం చేసింది. మరోవైపు ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి 2028 వరకు గడువు ఉండటంతో సదరు కాంట్రాక్టర్ సైతం నత్తనడకన ఆర్వోబీ నిర్మాణ పనులను కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో అటువైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులకు తాత్కాలికంగా ఉపశమనం కలిగించేందుకు ఆ ప్రాంతంలో రోడ్డును నిర్మించడం గమనార్హం.



# ముద్దునూరులో ఎంఆర్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

- సామాజిక న్యాయం సాధనకు ఐక్యంగా పనిచేయాలని పిలుపు
- గ్రామ స్థాయిలో ఉద్యమాన్ని బలోపేతం చేయడమే లక్ష్యమన్న నాయకులు



**ముద్దునూరు,సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):**మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) గ్రామ స్థాయిలో సంస్థాగత బలోపేతానికి మరో అడుగు పడింది. మండల కో–ఇన్‌చార్జి బొట్ల ప్రతాప్, ముద్దునూరు గ్రామ సర్పంచ్ శ్రీమతి పసుల సునందసదానందం ఆధ్వర్యంలో గురువారం ముద్దునూరులో ఎంఆర్పీఎస్ గ్రామ కమిటీని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎంఆర్పీఎస్ ఉద్యమ ఆశయాలను గ్రామస్థాయిలో మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధన కోసం యువతను ఉద్యమంలో భాగస్వామ్యం చేయడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. సంస్థ బలోపేతంతో పాటు మాదిగ సమాజ అభ్యున్నతికి నిరంతరం పనిచేస్తామని స్పష్టం చేశారు. నూతన కమిటీలో గౌరవ సలహాదారుగా కొంగర చంటయ్య, సీనియర్ ఎంఆర్పీఎస్ నాయకుడిగా కోయిల సాంబయ్య, అధ్యక్షుడిగా కోయిల అశోక్, ఉపాధ్యక్షుడిగా కోయిల సాంబయ్య (బీటెక్), ప్రధాన కార్యదర్శిగా పసుల సురేష్, కోశాధికారిగా బరుపట్ల రవి ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కన్నం ముత్తయ్య, బొచ్చు సునీల్, రేణుకుంట్ల పవన్, కోయిల చేరాలు, కోయిల రత్నాకర్, చింత నరసింహస్వామి, కొంగర వినయ్, పసుల రాజు, కొంగర చిన్నసాయిలు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను నాయకులు అభినందిస్తూ, గ్రామంలో ఎంఆర్పీఎస్ కార్యకలాపాలను మరింత చురుకుగా నిర్వహించాలని సూచించారు.

# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


**- గోపిక, చిన్ని కృష్ణుడు వేషధారణలతో అలరించిన చిన్నారులు**





**హైదరాబాద్ సెప్టెంబర్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):**శ్రీకృష్ణాష్టమి రోజు చిన్న పిల్లల సందడి అంతా ఇంత కాదు. ఇంట్లో చిన్న పిల్లలు ఉన్న వాళ్లు.. తమ బిడ్డలను కన్నయ్యలా అలంకరించి మురిసిపోతారు. నగరంలోని పలు కాలనీలలో శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా ఈ దృశ్యాలే కన్పించ్చాయి. కృష్ణుడి వేషధారణలో చిన్నారి బాల బాలికలు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా జన్మాష్టమి వేడుకలను జరుపుకున్నారు. చిటిపొట్టి చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలకు కృష్ణుడు, గోపిలు, యశోద వంటి వేషధారణలతో కృష్ణాష్టమి సంబరాలను జరుపుకున్నారు. మగ పిల్లలకు కృష్ణుడి వేషం, ఆడ పిల్లలను గోపికలా తయారుచేసి తల్లిదండ్రులు సంతోషించారు. కొన్ని ప్రాంతాల్లో స్కూల్స్ లో కూడా కృష్ణాష్టమి సంబరాలను నిర్వహించారు. తమ స్టూడెంట్స్ కు కృష్ణుడి గోపికల వేషాలు వేసి వేడుకలను జరిపారు. చిన్నారులు గోపిక, శ్రీకృష్ణ వేషధారణలతో ఆకట్టుకున్నారు.

# అవంతి కళాశాలలో వైభవంగా 'శ్రీకృష్ణ జన్మాష్టమి' వేడుకలు




**హైదరాబాద్ సెప్టెంబర్ 04(పి సి డబ్ల్యూ న్యూస్):** బర్కత్‌పురలోని అవంతి డిగ్రీ & పీజీ కళాశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విద్యార్థులు, అధ్యాపకులు భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణాన్ని సంప్రదాయబద్ధంగా ముస్తాబు చేయగా, విద్యార్థులు, అధ్యాపక బృందం సంప్రదాయ వస్త్రధారణతో హాజరై వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. యువతలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని, విద్యార్థుల్లో ఐక్యతా భావాన్ని పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు ఉట్టి కొట్టడం (దహీ హండీ), కుండల అలంకరణ (మట్కీ డెకరేషన్), శ్రీకృష్ణుడి విశేషాలపై క్విజ్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు కళాశాల యాజమాన్యం ప్రథమ, ద్వితీయ బహుమతులను ప్రదానం చేసింది. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అధ్యాపకులను, ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాగరాజు, వైస్–ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేణుగోపాల్ ప్రత్యేకంగా అభినందించారు. సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పిన ఈ వేడుకలు విద్యార్థుల కోలాహలం మధ్య ముగిశాయి.




# 46 మంది ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

**- TRSMA ములుగు జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**



**మల్లంపల్లి మండలం ప్రతినిధి సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (TRSMA) ములుగు జిల్లా ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇంచర్లలోని బ్రాహ్మణి విద్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి TRSMA ములుగు జిల్లా అధ్యక్షులు పోశాల వీరమల్లు అధ్యక్షత వహించారు. TRSMA రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ములుగు జిల్లాలోని 23 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 46 మంది ఉపాధ్యాయులను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం కోసం అంకితభావంతో పనిచేస్తూ విద్యారంగానికి విశిష్ట సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా TRSMA రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి గౌరవించడం ద్వారా వారిలో మరింత ఉత్సాహం, బాధ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. TRSMA హనుమకొండ జిల్లా అధ్యక్షులు సతీష్ మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. మంచి ఉపాధ్యాయుడు పాఠ్యాంశాలను బోధించడంతో పాటు విద్యార్థుల్లో ఆలోచనా విధానం, క్రమశిక్షణ, విలువలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తారని తెలిపారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పలువురు పాఠశాలల కరస్పాండెంట్లు మాట్లాడుతూ.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి విద్యా సంవత్సరం ౨=హీూ ములుగు జిల్లా ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కార్యక్రమాన్ని ఆనవాయితీగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రతి ప్రైవేట్ పాఠశాల నుంచి విద్యార్థుల విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను ఎంపిక చేసి సత్కరించడం ద్వారా వారిని మరింత ప్రోత్సహించవచ్చని పేర్కొన్నారు. పురస్కారాలు అందుకున్న 46 మంది ఉపాధ్యాయులను వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, TRSMA నాయకులు, సహచర ఉపాధ్యాయులు అభినందించారు. ఈ పురస్కారాలను తమ సేవలకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నామని, భవిష్యత్తులో విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించేందుకు అంకితభావంతో పనిచేస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. TRSMA ములుగు జిల్లా అధ్యక్షులు పోశాల వీరమల్లు మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తించి గౌరవించడం ౨=హీూ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని అన్నారు. ఉపాధ్యాయులకు ప్రోత్సాహం అందించడం ద్వారా వారిలో మరింత ఉత్సాహం, బాధ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. ములుగు జిల్లాలో విద్యా ప్రమాణాల పెంపు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో TRSMA ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కొంగరి శ్రీనివాసరావు, ట్రెజరర్ సురేందర్ రెడ్డి, సలహాదారు రాజేందర్ రెడ్డి, రాష్ట్ర బాధ్యులు కందాల రమేష్, వల్లూరిపల్లి ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పోరిక రవికిరణ్, పెండ్యాల ప్రభాకర్, జిల్లా బాధ్యులు సతీష్, ధర్మరాజు, రాజన్న, కరస్పాండెంట్లు సంతోష్, వెంకన్న, వందన, సంతోష్, రాజు, రామకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన బ్రాహ్మణి విద్యాలయం యాజమాన్యానికి, పాల్గొన్న పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులకు TRSMA ములుగు జిల్లా కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

# భద్రత గాలికి.. కార్మికుల ప్రాణాలు పణంగా!

- హబ్సిగూడలో రద్దీ రహదారిపైనే పారిశుద్ధ్య పనులు
- ఉప్పల్‌సికింద్రాబాద్ మార్గంలో వాహనాల మధ్యే విధులు
- హెచ్చరిక బోర్డులు లేవు.. రక్షణ కంచెలు కనిపించవు
- కార్మికులకే కాదు.. వాహనదారులకూ పొంచి ఉన్న ప్రమాదం
- ప్రమాదం జరిగే వరకు అధికారుల కళ్లు తెరుచుకోవా?





**ఉప్పల్ సెప్టెంబర్ 04(పి సి డబ్ల్యూ న్యూస్ ):** నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు రోడ్లపై నిత్యం శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజల ఆరోగ్యం కోసం పనిచేసే కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉన్నప్పటికీ రద్దీ రహదారులపై కనిపిస్తున్న కొన్ని దృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. కార్మికుల భద్రతతో పాటు అదే సమయంలో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, పాదచారుల భద్రతపైనా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. **హబ్సిగూడలో నడిరోడ్డుపైనే పనులు** హబ్సిగూడ మెట్రో స్టేషన్ పరిధిలో ఉప్పల్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై పారిశుద్ధ్య పనులు చేపడుతున్న దృశ్యాలు స్థానికుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. రద్దీగా ఉండే ఈ మార్గంలో కార్లు, ద్విచక్ర వాహనాలు నిరంతరం రాకపోకలు సాగిస్తుండగా.. రహదారి పక్కనే మహిళా పారిశుద్ధ్య కార్మికురాలు వంగి పనిచేస్తుండటం కనిపించింది. సమీపంలో మరో కార్మికుడు చేతిబండితో విధులు నిర్వహిస్తున్నాడు. వాహనాలకు అతి సమీపంలో కార్మికులు పనిచేస్తున్న సమయంలో ఒక్కసారిగా వాహనం అదుపుతప్పినా.. పరిస్థితి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. దీంతో 'పారిశుద్ధ్య పనులు అవసరమే.. కానీ కార్మికుల ప్రాణాలకు రక్షణ లేదా?' అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. **కార్మికుల ప్రాణాలకు రక్షణ ఎక్కడ?** రహదారులపై పనిచేసే కార్మికులకు వాహనదారులకు స్పష్టంగా కనిపించే భద్రతా దుస్తులు, చేతి తొడుగులు తదితర రక్షణ పరికరాలు అందించడంతో పాటు.. పనులు జరుగుతున్న ప్రాంతాన్ని ముందుగానే గుర్తించేలా హెచ్చరిక సూచికలు, అవసరమైన చోట రక్షణ కంచెలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అయితే హబ్సిగూడలో కనిపించిన దృశ్యాల్లో ఇలాంటి ముందస్తు భద్రతా ఏర్పాట్లు స్పష్టంగా కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పనులు పూర్తిచేయడంపై చూపుతున్న శ్రద్ధలో కొంతైనా పనులు చేస్తున్న వారి ప్రాణాలను కాపాడటంపై చూపాలని స్థానికులు కోరుతున్నారు. **వాహనదారులకూ తప్పని ఇబ్బందులు** రహదారిపై పారిశుద్ధ్య పనులు జరుగుతున్నప్పుడు వాహనదారులకు ముందస్తు సమాచారం లేకపోతే ఒక్కసారిగా వేగం తగ్గించడం, పక్కకు మళ్లడం వంటి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రద్దీ సమయాల్లో ఇలాంటి పనులు చేపడితే కార్మికులతో పాటు వాహనదారులు, పాదచారులకూ ప్రమాదం పొంచి ఉంటుంది. కార్మికుల భద్రతను కాపాడటంతో పాటు.. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా పనులను సమన్వయంతో నిర్వహించాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు. **రద్దీ వేళల్లోనే ఎందుకు?** ఉప్పల్‌సికింద్రాబాద్ మార్గం నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఇలాంటి ప్రధాన రహదారులపై సాధ్యమైనంత వరకు రద్దీ తక్కువగా ఉండే సమయాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించాలి. అత్యవసర పరిస్థితుల్లో రద్దీ సమయంలోనే పనులు చేపట్టాల్సి వస్తే.. ముందస్తుగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, రక్షణ కంచెలు పెట్టడం, అవసరమైతే ట్రాఫిక్ సిబ్బంది సహకారం తీసుకోవడం వంటి చర్యలు చేపట్టాలి. అలా చేస్తే కార్మికులకే కాకుండా వాహనదారులకు కూడా భద్రత పెరుగుతుంది. **ప్రజల కోసం పనిచేసే వారికి భద్రత కల్పించరా?** నగర పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకం. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు వారు రహదారులపై పనిచేస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారు. అలాంటి కార్మికులను కేవలం పనులు పూర్తి చేసే సిబ్బందిగా కాకుండా.. వారి ప్రాణాలకు కూడా విలువ ఉందనే దృష్టితో అధికారులు వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఒకవైపు పరిశుభ్రమైన నగరం కావాలని ప్రజలు కోరుకుంటుంటే మరోవైపు ఆ పరిశుభ్రత కోసం పనిచేసే కార్మికులే ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహించాల్సి రావడం బాధాకరమని స్థానికులు అంటున్నారు. **ప్రమాదం జరిగాక స్పందిస్తారా?** ప్రమాదం జరిగిన తర్వాత పరిహారం, విచారణ, చర్యల కంటే.. ప్రమాదం జరగకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడమే అధికారుల అసలు బాధ్యత. రద్దీ రహదారులపై పారిశుద్ధ్య పనులు జరుగుతున్న ప్రాంతాలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అన్నది తనిఖీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. హబ్సిగూడ మెట్రో స్టేషన్ పరిధిలో ఉప్పల్‌సికింద్రాబాద్ ప్రధాన రహదారిపై కనిపించిన పరిస్థితుల నేపథ్యంలోనైనా అధికారులు వెంటనే స్పందించి.. కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు, హెచ్చరిక సూచికలు, రక్షణ కంచెలు, తగిన పని సమయాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అమలు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల కోసం పనిచేసే కార్మికుల ప్రాణాలు కూడా ప్రజల ప్రాణాలంతే విలువైనవే. పరిశుభ్రత పేరుతో భద్రతను పక్కన పెట్టకుండా.. 'పని కూడా జరగాలి, ప్రాణాలూ కాపాడాలి' అనే విధానంతో అధికారులు ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైంది.



# రఘునాథపాలెం సమగ్ర అభివృద్ధికి పెద్దపీట

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం చేయాలి: మంత్రి తుమ్మల

## సమగ్ర అభివృద్ధికి పెద్దపీట

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం.. ఎల్నినో నేపథ్యంలో తక్కువ కాలపరిమితి పంటలు సాగు చేయాలి: మంత్రి తుమ్మల

**రఘునాథపాలెం, సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** రఘునాథపాలెం మండల సమగ్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం, గ్రామీణ మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ప్రతి గ్రామానికి అవసరమైన రహదారులు, సాగునీరు, విద్య, గృహ వసతులు కల్పించేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. శుక్రవారం రఘునాథపాలెం మండలం పుతానితండాలో పుతానితండా జెడ్పీ రోడ్డు నుంచి రేపల్లెవాడ తండా వరకు రూ.330.92 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. **ఎల్నినో ప్రభావం.. తక్కువ కాలపరిమితి పంటలపై దృష్టి**ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో తీవ్ర వాతావరణ పరిస్థితులు, వర్షాభావం, అల్ప వర్షపాతం ఉండే అవకాశం ఉన్నందున రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగులో మార్పులు చేసుకోవాలని సూచించారు. సాంప్రదాయ పంటలతో పాటు తక్కువ కాలపరిమితి కలిగిన పంటలు, ఆయిల్‌పామ్, మిర్చి, కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.50 వేల వరకు ప్రోత్సాహకం, అంతరపంటగా కూరగాయలు సాగు చేస్తే అదనంగా రూ.2 వేల ప్రోత్సాహకంతో పాటు ఉచిత డ్రిప్ పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుతో సుమారు 40 ఏళ్ల వరకు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని మంత్రి వివరించారు. **చెరువులు నింపి భూగర్భ జలాల పెంపు**మంచుకొండ ద్వారా నీటి విడుదలకు చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. బొగ్గువాగు ప్రాజెక్టు ద్వారా దాదాపు రూ.100 కోట్ల వ్యయంతో పైప్‌లైన్ల ద్వారా చెరువులను నింపే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. చెరువులు నిండితే భూగర్భ జలాలు పెరిగి రైతుల బోర్లకు నిరంతర నీటి లభ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. **పోడు పట్టాదారులకు బోర్లు, విద్యుత్, సోలార్ సౌకర్యం** పోడు భూములకు పట్టాలు పొందిన రైతులకు బోర్లు, విద్యుత్ కనెక్షన్లు, సోలార్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. సమస్యలు ఉన్న రైతులు ఈ నెల 10వ తేదీన దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. మండలంలోని పొలాల దారులు, గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రతిపాదించిన రూ.100 కోట్లలో ఇప్పటికే రూ.75 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో సుమారు 200 రోడ్లకు టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని మంత్రి చెప్పారు. **విద్యకు ప్రాధాన్యం.. 'స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు** గిరిజన విద్యార్థుల కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో 'స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్' పాఠశాలను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ఇక్కడ ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన ఉంటుందని చెప్పారు. స్వామినారాయణ





పాఠశాలల్లో స్థానిక పేద విద్యార్థులకు 10 శాతం ఉచిత సీట్లు లభించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పిల్లలను బాగా చదివించాలని, విద్య ద్వారానే కుటుంబాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని మంత్రి సూచించారు. **నిరుపేదలకు ప్రాధాన్యంతో ఇందిరమ్మ ఇళ్లు** గుడిసెల్లో, నిరుపేద స్థితిలో నివసిస్తున్న కుటుంబాలను గుర్తించి వారికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం, ఉచిత విద్యుత్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా సర్పంచులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. **అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి: కలెక్టర్** జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందన్నారు. మంత్రుల చొరవతో పెద్ద ఎత్తున నిధులు మంజూరవుతున్నాయని, అభివృద్ధి పనులు వేగంగా, పారదర్శకంగా పూర్తవుతున్నాయని తెలిపారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు కలిగిన భూముల యజమానులు బోర్‌వెల్ తవ్వుకునేందుకు అనుమతులు మంజూరు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా బోర్‌వెల్ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న రోజే పరిశీలించి అనుమతి ఇచ్చేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 10న మండల కార్యాలయంలో ప్రత్యేకంగా దరఖాస్తుల స్వీకరణ చేపడుతున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్, జిల్లా అటవీ అధికారి అనూప్ అగర్వాల్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, డీసీవో గంగాధర్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్‌రావు, ఇరిగేషన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, పీఆర్ ఈఈ మహేష్‌బాబు, రఘునాథపాలెం ఎంపీడీవో అశోక్‌కుమార్, తహసీల్దార్ శ్వేత, గ్రామ సర్పంచ్ మూడ్ చిన్న, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల మోసపూరిత పాలనపై మహిళల ఉగ్రరూపం ఏటూరునాగారంలో బీఆర్ఎస్ భారీ ర్యాలీ, ధర్నా

**ములుగు జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల మోసపూరిత, అవినీతి అక్రమాల పాలనను ఎండగడుతూ బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతిల నాయకత్వంలో ఏటూరునాగారంలో మహిళలు, గులాబీ శ్రేణులు భారీ ఎత్తున కదం తొక్కారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక మహిళలు విశేష సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ సర్కార్‌పై తమ నిరసన వ్యక్తం చేశారు. ఓడగూడెం నుండి ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల ధర్నా చౌక్ వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర సాగింది. ధర్నా చౌక్ వద్ద మహిళలతో పాటు పార్టీ నాయకులు ప్రధాన రహదారిపైనే వంటావార్పు చేపట్టి రహదారిని దిగ్బంధించారు. ఈ సందర్భంగా కాకులమర్రి లక్ష్మణ్




బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా శూన్యమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక మంత్రి సీతక్క ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. ఏటూరునాగారంలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, నూతన బస్టాండ్, బస్ డిపో నిర్మాణం, గోదావరి కరకట్ట పనులు, రైతుబంధు, రుణమాఫీ, కమలాపూర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభం, పోడు భూముల పట్టాలు, గ్యాస్ సబ్సిడీ, పెన్షన్లు, కళ్యాణలక్ష్మి బకాయిలు వంటి అనేక అంశాలపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ములుగులో దొరల పాలన లేదని, తమది ప్రజల సమస్యల పరిష్కారానికై పోరాడే 'జనతా గ్యారేజ్' అని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి నిరసన ఫ్లెక్సీలు, బ్యానర్లను పోలీసులతో కలిసి తొలగించడం కాంగ్రెస్ నాయకుల దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. ఇటువంటి కుట్రలకు భయపడేది లేదని, రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. వంటావార్పు వద్ద మహిళలకు, శ్రేణులకు నాయకులు స్వయంగా భోజనాలు వడ్డించారు బీఆర్ఎస్ జిల్లా ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, తెలంగాణ ఉద్యమకారులు మరియు గులాబీ శ్రేణులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# సేవా సంకల్ప్ అభియాన్ ప్రోగ్రాంను విజయవంతం చేయాలి..

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం....



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 04(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల నిర్విరామ సేవా ప్రయాణాన్ని, దేశాభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషిని , వికసిత్ భారత్ 2047 సంకల్పాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా ఈనెల 17 నుండి అక్టోబర్ 17 వరకు చేపట్టిన 'సేవా సంకల్ప అభియాన్' ప్రోగ్రాంను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని శుభమంగళ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రోజున 'సేవా సంకల్ప అభియాన్' జిల్లా కార్యశాల సన్నాహక సమావేశం జరిగింది . ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సాయిని మల్లేశం పార్టీ శ్రేణులకు సేవా సంకల్పయాన్ ప్రోగ్రాం కు సంబంధించి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ప్రధాని మోదీ రాజకీయ జీవితాన్ని, ఆయన అంకితభావాన్ని కార్యకర్తలు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన సూచించారు. దేశం కోసం, ప్రజల సంక్షేమం కోసం సేవా సంకల్పంతో నిరంతరం శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్, రాష్ట్ర అధికార ప్రతినిధి సునీల్ రావు , సీనియర్ నాయకులు, మంచిర్యాల జిల్లా ఇన్చార్జి కన్నబోయిన ఓదెలు లు మాట్లాడుతూ వికసిత్ భారత్ 2047 సంకల్పాన్ని నెరవేర్చడానికి ప్రధాని మోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా పార్టీ సూచించిన, నిర్దేశించిన ప్రతీ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయాలని పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా సాయిని మల్లేశం సూచించారు. సేవా సంకల్ప్ అభియాన్ ప్రోగ్రాం జిల్లా కన్వీనర్ , బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా జాతీయ, రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు పోలింగ్ బూత్ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ , బీజేవైఎం జిల్లా అధ్యక్షులు, సేవా సంకల్ప్ అభియాన్ ప్రోగ్రాం కో కన్వీనర్ సంఘ నరేష్, గుంజేటి శివ , సుగుర్తి జగదీశ్వర చారి , జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి , వైద రామానుజశీ, పుప్పాల రఘు , దండు కొమురయ్య , కరివేద మహీపాల్ రెడ్డి, అలివేలు సమ్మిరెడ్డి మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మల రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షులు మోతే గంగారెడ్డి , ఎస్సీ మోర్చా అధ్యక్షులు బత్తుల లక్ష్మీనారాయణలతో పాటు మండల , జోన్ అధ్యక్షులు, సేవా సంకల్ప్ అభియాన్ మండల కన్వీనర్లు కో కన్వీనర్లు , కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ అరాచకాలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది..

## ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు: బిజెపి మండల అధ్యక్షులు ఏనుగుల అనిల్"

**కరీంనగర్ జిల్లా సెప్టెంబర్ 4(పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంపై, మహనీయుడు సంత్ రవిదాస్ చిత్రపటంపై నల్లరంగు చల్లి అవమానించడాన్ని నిరసిస్తూ, అలాగే నల్గొండ జిల్లాలో బీజేపీ క్యాంపు కార్యాలయం మరియు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై జరిగిన దాడిని ఖండిస్తూ కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండల కేంద్రంలో బీజేపీ ఎస్సీ మోర్చా మండల శాఖ అధ్యక్షులు కనకం కుమారస్వామి మండల శాఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేయడం, సంత్ రవిదాస్ చిత్రపటాన్ని అవమానించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన ఖండించారు. అలాగే నల్గొండ జిల్లాలో బీజేపీ క్యాంపు కార్యాలయంపై, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేసి విధ్వంసం సృష్టించడం దారుణమని అన్నారు. ఈ దాడిలో ఆయన తల్లి గాయపడటం అత్యంత అమానుషమని, మహిళల పట్ల కూడా కనీస గౌరవం లేకుండా కాంగ్రెస్ శ్రేణులు వ్యవహరించడం



సిగ్గుచేటని విమర్శించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏనుగుల అనిల్ మాట్లాడుతూ, "ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి మా హెచ్చరిక. భారతీయ జనతా పార్టీ సహనాన్ని చేతకానితనంగా భావించవద్దు. హద్దుల్లో ఉండండి. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఇప్పటికే గమనిస్తున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ, ప్రతిపక్షాలపై దాడులు చేయడం మానుకోవాలి. భారతీయ జనతా పార్టీ ఉద్యమించాలని నిర్ణయించుకుంటే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా మనుగడ ఉండదు. ప్రజల సమస్యలను పరిష్కరించి సుపరిపాలన అందించడంపై దృష్టి పెట్టాలి. అరాచకాలు, గూండాయిజం, ప్రతీకార రాజకీయాలకు స్వస్తి చెప్పాలి" అని హెచ్చరించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ మరింత ఉద్ధృతంగా పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ దండు కొమురయ్య , మాజీ ఎంపీపీ దొంగల రాములు,జిల్లా కౌన్సిల్ మెంబర్ దాసరపు నరేందర్, బిజెపి సర్పంచ్లు వెన్నం మల్లేశం కొయ్యడ కుమార్ యాదవ్, ఉప సర్పంచ్ జంగ జైపాల్, కొయ్యడ అశోక్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మచెట్టు సంపత్ రావు,మండల ఉపాధ్యక్షులు ఎలుక పెల్లి సంపత్ , రాసమల్ల శ్రీనివాస్ , కార్యదర్శి గౌరవేణి శ్రీనివాస్ , బిజిలి సారయ్య, బోడ తిరుపతిరెడ్డి,మహిళ మోర్చాఅధ్యక్షురాలు చర్ల అనిత యువ మోర్చా మండల అధ్యక్షుడు బొజ్జ సాయి ప్రకాష్ బిజెపి సీనియర్ నాయకులు పలకల రాజిరెడ్డి, మందాడి జగ్గారెడ్డి, రాజిరెడ్డి.జాన పట్ల రాజిరెడ్డి దాసరి సంపత్,చర్ల శ్రీనివాస్ , శివారెడ్డి, వీరా అర్జున్, రంజిత్ శ్రీనాథ్ ,కుమార్ , వికాస్, సాయి, మైపాల్ ,బీజేపీ మండల నాయకులు, ఎస్సీ మోర్చా నాయకులు, శక్తికేంద్ర ఇన్‌చార్జులు, బూత్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంత్ శిరోమణి గురు రవిదాస్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి..

**బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం..**



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** సమాజంలో కుల వివక్షత లేని సమసమాజ స్థాపన కోసం, సామాజిక సమరసత కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప ఆధ్యాత్మిక సంస్కర్త సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ అని బిజెపి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం కొనియాడారు. రవిదాస్ మహారాజ్ 650వ జయంతి ఉత్సవాల సందర్భంగా బిజెపి జాతీయ, రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు జిల్లాలో బిజెపి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం రోజున కరీంనగర్లో బిజెపి ఎస్సీ మోర్చా ముఖ్య నాయకులు, మండల బిజెపి నాయకులతో శుభ మంగళ కన్వెన్షన్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సాయిని మల్లేశం మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రవిదాస్ మహారాజ్ ఆశయాలకు అనుగుణంగా అణగారిన వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. **జిల్లా వ్యాప్తంగా 'సామాజిక సమరసతా సంకల్ప్ అభియాన్'** రవిదాస్ 650వ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండల గ్రామ స్థాయిల్లో "సామాజిక సమరసతా సంకల్ప్ అభియాన్" పేరిట ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు , ప్రోగ్రాం కన్వీనర్ బత్తుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ "సామాజిక సమరసతా సంకల్ప్ అభియాన్" ప్రోగ్రాంలో భాగంగా ఎస్సీ మోర్చా నాయకులు ప్రతి గ్రామంలోని దళితవాడలను సందర్శించి, సంత్ రవిదాస్ బోధనలు, సమానత్వ సందేశాన్ని ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు.క్షేత్రస్థాయిలో రవిదాస్ చిత్రపటాలతో శోభాయాత్రలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పేదలకు వస్త్రదానం, అన్నదానం, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ వంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

నేటి యువతరానికి రవిదాస్ చూపిన భక్తి మార్గం, కుల రహిత సమాజ నిర్మాణంపై అవగాహన సదస్సులు ఏర్పాటు ఏర్పాటు చేయాలన్నారు. సంతు రవిదాస్ జన్మస్థలం నుండి సేకరించిన పవిత్ర మట్టి కలశం జిల్లా కు తీసుకురావడం జరిగిందని , ఇట్టి కలశాన్ని ప్రతి మండలానికి తీసుక వెళ్లి , కలశ వందన కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి మండలానికి కలశాన్ని అందజేశారు. ఇటీవల నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ శ్రేణులు బిజెపి కార్యాలయంపై దాడి చేసి, సంత్ రవిదాస్ చిత్ర పటం పై సిరా రంగు చల్లి అవమానించడాన్ని సాయిని మల్లేశం, ఎస్సీ మోర్చా అధ్యక్షులు బత్తుల లక్ష్మీనారాయణ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దళిత వ్యతిరేక చర్యలను బిజెపి ఎస్సీ మోర్చా అస్సలు సహించబోదని, రవిదాస్ మహారాజ్ కీర్తిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సమావేశంలో బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా పదాధికారులు, నియోజకవర్గ కన్వీనర్లు, ముఖ్య నాయకులు , కార్యకర్తలతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డిజిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్, గుంజేటి శివ, సుగుర్తి జగదీశ్వర చారి బీజేపీవైఎం జిల్లా అధ్యక్షులు సంఘు నరేష్,జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, వైదరామానుజం, పుప్పాల రఘు, దండు కొమురయ్య, కరివేద మహిపాల్ రెడ్డి, అలివేలు సమ్మిరెడ్డి మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మల రెడ్డి,కిసాన్ మోర్చా అధ్యక్షులు: మోతే గంగారెడ్డి మండల, జోన్ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఘనంగా శోభాయాత్ర..

**● ముఖ్య అతిథిగా పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్..**





**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని సాయినగర్లో వెలసిన శ్రీ మురళీ కృష్ణ మందిరంలో 'సుందర్ సత్సంగ్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన శ్రీకృష్ణ, రాధ, గోపికల వేషధారణలో చిన్నారుల శోభాయాత్ర భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ శోభాయాత్రకు కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారుల వేషధారణను తిలకించి వారిని అభినందించారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, శ్రీకృష్ణ పరమాత్మ బోధనలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమని అన్నారు. ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ, మానవతా విలువలను శ్రీకృష్ణుడు తన బోధనల ద్వారా ప్రపంచానికి చాటిచెప్పారని పేర్కొన్నారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ప్రశాంతతకు, సమాజంలో ఐక్యతకు దోహదపడతాయని మేయర్ తెలిపారు. చిన్నారులను సంప్రదాయ పండుగలు, సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలకు చేరువ చేయడం అభినందనీయమన్నారు. రాధాకృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారులు పాల్గొని నిర్వహించిన శోభాయాత్ర అందరినీ ఆకట్టుకుందని, ఇటువంటి కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ఎంతో ఉపయోగపడతాయని మేయర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బొడ్ల కృష్ణ, కార్యదర్శి ఇ. సురేందర్ రావు, కోశాధికారి రాచర్ల వసంతం, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రముఖులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరీంనగర్ పట్టణంలో 1000 రోజుల ప్రజా పాలన సంబరాలు – ఘనంగా బైక్ ర్యాలీ



**ఇందిరా చౌక్ నుండి అంబేద్కర్ చౌక్ వరకు సాగిన కాంగ్రెస్ శ్రేణుల భారీ ర్యాలీ**

**ప్రజా పాలనతో ఇంటింటా వెలుగులు - వైద్యుల అంజన్ కుమార్**

**సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో మార్పు - కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్**

**ఫామ్ హౌస్ పాలన కాదు.. ప్రజలు మెచ్చిన పాలన: అంజన్ కుమార్**



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 04(పిసిడబ్ల్యూ న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో 1000 రోజుల ప్రజా పాలన – ప్రజా సంక్షేమ దినోత్సవాలను పురస్కరించుకుని నేడు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద సంబరాలు నిర్వహించి, నగరంలోని ప్రధాన వీధుల గుండా భారీ బైక్ ర్యాలీ చేపట్టడం జరిగింది.ఈ ర్యాలీ ఇందిరా చౌక్ నుండి ప్రారంభమై రాజీవ్ చౌక్, గాంధీ చౌక్, బాబు జగ్జీవన్ రావ్ చౌక్ మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు సాగింది.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు వెలి చాలా రాజేందర్ రావు,ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి, పురుమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ..."రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు పేదలకు అందుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 75 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారు.కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రతి పథకం పారదర్శకంగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా చేరుతోంది. గత పాలనలో మాదిరిగా ఫామ్ హౌస్ పాలన కాదు, ఇది ప్రజల గడప వద్ద పాలన. మహాలక్ష్మి, గృహజ్యోతి, చేయూత వంటి పథకాలతో ప్రతి ఇంట్లో వెలుగులు నింపాం.

విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపాం.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రతిపక్షాలు ఫామ్ హౌస్ లో నిద్రపోతున్న కేసీఆర్ ను లేపడానికి చార్జ్ షీట్ పేరుతో నాటకాలు ఆడుతున్నాయి. తెలంగాణ ప్రజలు మాత్రం ప్రజా పాలనను మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో కరీంనగర్ ను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏఎంసీ చైర్మన్ ఆకుల నర్సయ్య, ఆకారపు భాస్కర్ రెడ్డి, ఎండి తాజ్, శ్రావణ్ నాయక్, వరాల నర్సింగం, సిహెచ్. బుచ్చి రెడ్డి, కాంతాల జగన్ రెడ్డి, పడాల అజయ్ గౌడ్, వెన్నం రజిత రెడ్డి, మునిగంటి అనిల్, రేగొండ సందీప్, ఇమ్రాన్, వంగల విద్యాసాగర్, మూల కృష్ణారెడ్డి, పర్వత మల్లేశం,మడుపు మోహన్, కామ్ రెడ్డి రామ్ రెడ్డి, సాయిని తిరుపతి, శిల్ప, ఫహాద్, రాచకొండ ప్రభాకర్, మాదాసు శ్రీనివాస్, మల్లారెడ్డి,కోడూరు రవీందర్ గౌడ్, ఆసిఫ్,గడప అజయ్, అట్టెపు వేణు, టేల భూమయ్య, చింతల కిషన్, దన్న సింగ్, కూర నరేష్ రెడ్డి, వేల్పుల వెంకటేష్, అబ్దుల్ రహమాన్, లింగంపల్లి బాబు, దండి రవీందర్, గాండ్ల అంజయ్య, వీర దేవేందర్, విక్టర్, అమీర్, హాజీ, గోపు మల్లారెడ్డి,ఖలీముద్దీన్, కాశి పాక రాకేష్, నిహాల్, ఇమ్రాన్షని, కంకణాల అనిల్, సత్తినేని శ్రీకాంత్, లాయకు, కర్రె పావని, మాజీద్ అలీ ఖాన్, తోట అంజయ్య, కూన దామోదర్,మాలోతు మహాలక్ష్మి, మార్కరాజు, నెల్లి నరేష్, ఫజల్, పెంట శేఖర్, ఖలీల్, స్వప్న శ్రీ, గసగంటి కుమార్ రంగ నాయక్, సుధాకర్ నాయక్, బషీరుద్దీన్, రాచర్ల పద్మ,అందశంకర్, యనముల మంజుల, సుంకర గణపతి, గడప శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మాజీ సండ్ర



**సత్తుపల్లి, సెప్టెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :**
శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డ్ లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం వేడుకల్లో పాల్గొన్న భక్తులు, నిర్వాహకులకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, బెల్లంకొండ రాము, మల్లూరు అంకంరాజు, పర్వతనేని వేణు తదితరులున్నారు.

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**మల్లంపల్లి మండల ప్రతినిధి సెప్టెంబర్ 4:(పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మల్లంపల్లి మండలంలో కృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.కృష్ణుడి లీలలను గుర్తు చేస్తూ నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం స్థానికులను ఆకట్టుకుంది. చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. భక్తులు శ్రీకృష్ణుడిని పూజించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.వేడుకల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమని నిర్వాహకులు తెలిపారు.

